క్లుప్తంగా

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షం



జానంపేటలో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం

పెదవేగి : భారీ ఈదురుగాలులకు ఓ వృక్షం నేలకొరిగింది. పెదవేగి మండలం జానంపేట వద్ద గురువారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో వృక్షం నేలకొరిగింది. దీంతో ఏలూరు – చింతలపూడి రహదారిపై వాహనాలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు, స్థానికుల యుద్ధప్రాతిపదికన పడిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

మురుగు డ్రెయిన్ల ప్రక్షాళన



వాకపల్లిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

గణపవరం: మండలం వాకపల్లి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కొంతకాలంగా గ్రామంలోని సీసీ రోడ్ల ప్రక్కన మురుగు కాల్వలు పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్లమీదికి చేరడంతో అపారిశుద్ధ్యం నెలకొంది. వర్షం వస్తే పరిస్థితి మరీ దుర్భరంగా తయారవుతుంది. దీనితో సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ పర్యవేక్షణలో డ్రెయిన్లలో పూడిక తొలగించి, మురుగునీరు సక్రమంగా పారేలా చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల ప్రచారం



ఉప్పాకపాడులో ఉపాధ్యాయులు గృహ సందర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రైవేటు పాఠశాలలకు సవాల్ విసురుతున్నారు. నిన్నటి వరకూ ఎన్నికల ప్రచారంతో హోరెత్తిన గ్రామాలు ఇప్పుడు పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. తమ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, బోధన, తదితర అంశాలను వివరిస్తూ చిన్నారులను ఆకర్షించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ఈ తరహా ప్రచారంలోకి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలూ వచ్చి చేరడంతో మీ పిల్లలను మా బడికే పంపండంటూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒకరికొకరు పోటీపడుతూ ప్రచారాన్ని సాగిస్తున్నాయి. ఉప్పాకపాడులో ఉపాధ్యాయులు గృహ సందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, విద్యార్థులను హైస్కూల్‌లో చేర్పించాలని తల్లితండ్రులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లుశ్రీను, పి. శ్రీదేవిలు పాల్గొన్నారు.

చిన్నారుల వ్యక్తిగత వివరాలపై ఆరా



రాజేంద్ర ప్రసాద్‌కు మొక్కను అందిస్తున్న చిన్నారులు

ఏలూరు (టూటౌన్): స్థానిక విద్యానగర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శిశు గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూటషన్స్ నోడల్ అధికారి జె.దుర్గాప్రసాద్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న ఎనిమిది మంది చిన్నారుల వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకున్నారు. దత్తకు అర్హులైన బాలలకు సంబంధించి లీగల్లీ ఫ్రీఫర్ అడాప్షన్ ఆర్డర్ వెంటనే ఇవ్వాలని సీడబ్ల్యూసీ సభ్యులను ఆదేశించారు. బాలలకు అందిస్తున్న సేవలను, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అందిస్తున్న సహకారం రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా ఇక్కడి శిశు గృహాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్యచక్రవేణి, శిశు గృహం మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

వేగంగా మిలినియం చర్చి నిర్మాణం

దెందులూరు: స్థానిక గౌడవీధిలో సాల్వేషన్ ఆర్మీ మిలినియం చర్చి నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను గురువారం స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, సంఘపెద్దలు, దాతలు పరిశీలించారు. చర్చి నిర్మాణానికి రెండు సెంట్ల స్థలాన్ని దివంగత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లె యోహాన్, చంద్రహాస్ దంపతులు ఇచ్చిన సంగతి విధితమే.

పంట మార్పిడితో బహుళ ప్రయోజనాలు

- భూసారం వృద్ధి, చీడ పీడల నివారణ
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



సాగుకు భూమిని సిద్ధం చేసుకుంటున్న రైతు



రైతులకు పంట మార్పిడిపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పంట మార్పిడితో బహుళ ప్రయోజనాలు చేకూరతాయి. పొలంలో ఒకే పంటను సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గుతాయి. పంటల్లో ఎదుగుదల ఉండదు. చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. పంట మార్పిడి వలన భూసారం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయి. పంట మార్పిడితో ప్రకృతి వనరులు సమర్థవంతంగా వాడుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారం నష్టపోకుండా అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.

పంట మార్పిడితో లాభాలు..

పంట మార్పిడి విధానం వలన అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలి. వరి సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వలన భూసారం పెరుగుతుంది. సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వలన పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయా చిక్కుడు తదితర పంటలు సాగు చేస్తే భూమిలో సేంద్రీయ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటలపై వచ్చే శిలీంధ్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరు శనగ సాగుతో వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడుపుల మాదిరి ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

ఒకే పంట సాగుతో కలిగే నష్టాలు

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆ లోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వలన చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. అలాగే దిగుబడులు తగ్గి, రైతులకు పెట్టుబడుల భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యత ఉండదు. ఫలితంగా గిటుబాటు ధర లభించదు. దీంతో మార్కెట్ సమస్యలు ఎదురవుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే వేరు వ్యవస్థ గల పంట, తక్కువ లోతుకు చొచ్చుకుపోయే వేరు వ్యవస్థ గల పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. వరి, అపరాలు, జొన్న, ప్రత్తి వంటి పంటలు వరుసగా వేయడం మంచిది.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవడం మేలు. ఉదాహరణకు మొక్కజొన్న, అపరాలు వంటి పంటలు.

నియోజకవర్గంలోని మండలాల్లో సాగు వివరాలు

బుట్టాయగూడెం	3394 హెక్టార్లు
జీలుగుమిల్లి	2287 హెక్టార్లు
పోలవరం	3295 హెక్టార్లు
వేలేరుపాడు	1235 హెక్టార్లు
కుక్కునూరు	913 హెక్టార్లు
టి. నర్సాపురం	3054 హెక్టార్లు
కొయ్యలగూడెం	4354 హెక్టార్లు

పంట మార్పిడితో మంచి దిగుబడులు



రైతులు ప్రతీ ఏటా ఒకే పంట సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద అధికంగా వరి సాగు తప్ప వేరే పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువయ్యి, సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని అధిగమించడానికి పంట మార్పిడి విధానం ఉత్తమం. ఈ విధానంపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలి. పంట మార్పిడి విధానంపై క్షేత్రస్థాయిలో మా సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఏవో ముత్యాలరావు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 14 నుంచి 17 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీ.రాధాకృష్ణ తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కేతవరం ఫీడర్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 నుంచి 17 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగికి గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: రోడ్డు ప్రమాదంలో గురువారం ఆటో ఢీకొనడంతో ఒక మహిళ గాయాలపాలయ్యింది. జంగారెడ్డిగూడెం యూనియన్ బ్యాంకులో ఉద్యోగినిగా పని చేస్తున్న సత్రం మయూరి స్వగ్రామం చల్లా వారిగూడెం నుంచి గురువారం ద్విచక్ర వాహనంపై మయూరి బ్యాంక్‌కి బయలుదేరింది. తాడువాయిలో ద్విచక్ర వాహనాన్ని పాసింజర్ ఆటో ఢీ కొట్టింది. దీంతో మయూరి కాలుకు తీవ్ర గాయమయ్యింది. బంధువులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్‌లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మెగా డీఎస్సీపై ప్రకటన చేస్తున్న నేపథ్యంలో ఏజెన్సీలో కూడా ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని వారు కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతో ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు దుగ్గిరాల లక్ష్మణరావు

ఉంగుటూరు: భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణరావు (63) ద్విచక్ర వాహనంపై నిడదవోలు వెళ్తుండగా ఉంగుటూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టారు. దీంతో ఆయన తలకు తీవ్రగాయం కాగా తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతిచెందారు.

ఇకపై గిరిజన విద్యావంతుల వివరాలు ఆన్‌లైన్

ఐటీడీఏ పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గిరిజన విద్యావంతులైన వారు ఇకపై వెబ్‌సైట్ ద్వారా విద్యార్హతను ఆన్‌లైన్ నందు నమోదు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఐటీడీఏ ఉపాధి కార్యాలయంలో అరుంధతి ఆన్‌లైన్ డేటాలో అనుసంధానం చేసేవారని చెప్పారు. అయితే ఇప్పుడు హెచ్‌టిటిపిఎస్://ఎంప్లాయ్‌మెంట్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో విద్యావంతులైన వారే నమోదు చేసుకోవాలన్నారు. కొత్తగా నమోదు, రెన్యువల్స్, అదనపు విద్యార్హతల నమోదు, ఆధార్ నంబర్, కుల ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్ ఐడీతో అప్‌లోడ్ చెయ్యాలని కోరారు. సంబంధిత అధికారుల ఆమోదం తర్వాత ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అలాగే రెన్యువల్స్, అదనపు విద్యార్హతల నమోదు, ఐటీడీఏ కేఆర్‌పురం, ఉపాధి కార్యాలయంలో చేసుకునేందుకు వీలుందని చెప్పారు. ఈ సదుపాయాన్ని అర్హులైన గిరిజన విద్యావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు



దివ్యాంగులకు బస్సు పాస్‌లు అందజేస్తున్న సోషల్ సర్వీస్ సెంటర్ సభ్యులు

కామవరపుకోట: ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తాతపూడి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీ దివ్యాంగులకు ఇచ్చే బస్సు పాసులను గురువారం స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ ఆవరణలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఇప్పటికి 620 మందికి ఉచిత బస్సు పాస్‌లను అందజేశామన్నారు. అర్హతలను బట్టి ఏలూరు డిజేబుల్డ్ వెల్ఫేర్ ఆఫీస్ ద్వారా దివ్యాంగులను పరీక్షించి అవసరమైన వారికి వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, కాలిపర్స్, హియరింగ్ మిషన్స్, లాప్టాప్, స్మార్ట్ ఫోన్స్, లోన్స్, హ్యాండ్ స్టిక్స్, వాకర్స్, ట్రైన్ పాస్‌లు అందించి, పోలియో ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని ఆయన తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 6303610275, 9133621253 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్‌లు అమ్మన్న రాజా, పీటర్ ప్రసాద్, డాక్టర్ ఎస్.కృపానందం, కాసు కుమారి, ఝాన్సీ రాణి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ఏడువాడలపాలెంలో గ్రాడ్యుయేషన్ సమావేశంలో మాట్లాడుతున్న పీవో

కొయ్యలగూడెం: యర్రంపేట పంచాయతీ ఏడువాడలపాలెం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పొంగుటూరు సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ పీవో యూఎన్.స్వర్ణకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు సమావేశం ఏర్పాటు చేసి గ్రాడ్యుయేషన్ డే విశిష్టతను తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన చిన్నారులు అంగన్‌వాడీ చదువును పూర్తి చేసుకొని ప్రాథమిక పాఠశాలకు వెళుతున్న వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కే.మాధవి, ఎన్.కనకదుర్గ, కే.రాణీరత్నం, ఎం.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



భీమడోలులో మొక్కలు నాటుతున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు, చిన్నారులు

భీమడోలు: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థి దశ నుంచి భాగస్వాములు కావాలని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంచార్జి హెచ్ఎం అహ్మద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు పాల్గొని ప్రసంగించారు. ఎకో క్లబ్ యాక్టివిటిస్‌లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నాలన్నారు. పర్యావరణం పట్ల సామాజిక స్పృహను కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నాటిన మొక్కలను దత్తత తీసుకుని వాటిని సంరక్షించాలన్నారు. నేటి సమాజంలో వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని, దీని వల్ల మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. వాతావరణ కాలుష్య మహమ్మారీని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తమ గృహాల వద్ద విరివిగా మొక్కలు నాటిని వాటిని సంరక్షించుకోవాలని, తల్లిదండ్రులను సైతం చైతన్యవంతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



కొవ్వలి హైస్కూల్లో పర్యావరణ దినోత్సవం

దెందులూరు: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఎంఈఓ-2 కె.అన్నమ్మ అన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జీఎస్ఎల్ఎన్‌వీ శర్మ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ వారోత్సవాలను అన్నమ్మ ప్రారంభించారు. భూమి, నేల, చెట్టు, నీరు అంశాలపై విద్యార్థులకు సైన్సు ఉపాధ్యాయులు కరుణకుమారి, రాధాకృష్ణ, మజీద్‌ఖాన్‌లు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. అనంతరం ఏకో క్లబ్ విద్యార్థులు పర్యావరణంపై గీసిన చిత్రాలను పాఠశాలలో ప్రదర్శించారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది..



కొండగూడెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కామవరపుకోట: అంగన్‌వాడీ కేంద్రంలోనే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించబడుతోందని కామవరపుకోట సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్.మంగాదేవి అన్నారు. గురువారం మండలంలో కొండగూడెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన బడి ఈడు పిల్లలను ఎలిమెంటరీ పాఠశాలలో చేర్పించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది భాగ్యలక్ష్మి, సువర్ణ కుమారి, ఎస్తేరు, విజయ కుమారి, శాంత కుమారి, గ్రేస్, ఎస్.కుమారి, పుష్ప పాల్గొన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



సరిపల్లె సీపీఎఫ్ కంపెనీ వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని కంపెనీ యాజమాన్యం అన్యాయంగా మూసి వేసి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ కంపెనీ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలు గురువారం ఏడోరోజుకు చేరాయి. కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కంపెనీ గేటు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఉద్యోగాలలోకి తీసుకున్న సమయంలో ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మరిచిపోయి ఉద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. సీపీఎఫ్ రొయ్యలు, చేపలమేతల తయారీ కంపెనీకి దేశంలో అనేక చోట్ల యూనిట్లు ఉన్నాయని, వీటిలో సరిపల్లె యూనిట్ లాభాలలో ఉన్నా ఎందుకు మూసి వేశారో అర్థంకావడం లేదని ఉద్యోగులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని, పరిహారం చెల్లించాలని, కంపెనీని తెరవాలని వారు నినాదాలు చేశారు. ఈ నిరహార దీక్షలో పలువురు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సొసైటీలకు బ్రాందీ షాపులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కల్లుగీత సొసైటీలకు 40 శాతం బ్రాందీ షాపులు కేటాయించాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కష్టాల్లో ఉన్న కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించి, గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను తక్షణం ప్రక్షాళన చేయాలన్నారు. కల్లు గీత కార్మిక సొసైటీలకు పూర్తి జవసత్వాలు తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గీత కార్పొరేషన్ పునరుద్ధరించి ప్రభుత్వానికి, గీత కార్మికులకు మధ్య వారధిగా పనిచేయాలని కోరారు.

రోటరీ క్లబ్ సభ్యుల నివాళి



రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు.

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ విస్తరణకు, కొయ్యలగూడెం బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి ఇమ్మిడిశెట్టి సత్యనారాయణ విశేష కృషి చేశారని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ బోడిపిండి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇమ్మిడిశెట్టి సత్యనారాయణ సంస్మరణ సభ గురువారం రాజీవ్ నగర్‌లో నిర్వహించారు. రెండు దశాబ్దాల క్రితం రోటరీ క్లబ్ సభ్యుడిగా జాయిన్ అయిన సత్యనారాయణ విశేష సేవలతో అధ్యక్షుడిగా ఎదిగి సేవలందించారన్నారు. ఆయన మృతి క్లబ్‌కు తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథ శర్మ, సభ్యులు ఎస్‌కే.అమీర్ భాషా, జీ.రామ్మోహన్‌రావు, మద్దు గోపి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అవగాహన

దెందులూరు: మలేరియా జ్వరాల వ్యాప్తి, నిర్మూలనపై ప్రజలకు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అవగాహన కల్పించారు. గురువారం కొవ్వలిలో పోతునూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ హరిబాబు, పద్మావతి ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ కీటకాలన్నింటిలో దోమల అత్యంత ప్రమాదకరమన్నారు. వీటి వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయని, దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ దోమలు ఇళ్ల వద్ద మంచినీరు నిల్వ ఉండే తొట్టెలు, డ్రమ్ములు, వాడేసిన టైర్లు, కాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, పూలకుండీలు, ఫ్లవర్‌వాజ్‌ల్లో పెరుగుతాయని చెప్పారు. వారానికోసారి పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చని సూచించారు.

టీడీపీ శ్రేణుల వేడుకలు

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ (పండు) ఆధ్వర్యంలో స్థానిక సూర్య కిరణ్ కళ్యాణ మండపంలో కూటమి నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడానికి సహకరించిన ప్రజలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై 'కూటమి' దాటవేత



కొయ్యలగూడెం జెడ్పీటీసీ శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం: రాష్ట్రంలో పాలనలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అపుడే మెగా డీఎస్సీపై మాట మార్చిందని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికలకు ముందు 25 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని కూటమి నాయకులు ఆర్భాటంగా ప్రచారం చేశారన్నారు. బాధ్యతలను స్వీకరించిన తొలి రోజే చంద్రబాబునాయుడు తన అసలు నైజాన్ని ప్రదర్శిస్తూ 16,347 పోస్టులకు మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం పెట్టడం మోసపూరితమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన 16,347 పోస్టులలో 6,100 పోస్టులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ ఇచ్చినవే అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కూటమి ప్రభుత్వం అపుడే దాటవేత ప్రక్రియ ప్రారంభించిందని ఎద్దేవా చేశారు.